క్లుప్తంగా

విద్యతోనే గుర్తింపు

కొడకండ్ల: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ కీలకమని మండల ఎంఈఓ గ్రేస్‌కేజీయా రాణి అన్నారు. మంగళవారం మండలకేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ అధ్యాపకులు ధర్మేంద్ర, బాబురావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ కీలకం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు ఇంటర్‌మీడియట్ అత్యంత కీలకమైన దశయని స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంఛార్జీ ప్రిన్సిపాల్ కమలాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు ఎస్.సాంబమూర్తి, జి.నవీన్, ఎం.కరుణాకర్, సీహెచ్.లావణ్య, ఎస్.మోహన్, కె.శ్వేత పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక



హర్షవర్ధన్, సింధు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల కరీంనగర్ జిల్లా కురిక్యాలలో జరిగిన షూటింగ్‌బాల్ సబ్‌జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హర్షవర్ధన్(హోలీక్రాస్‌స్కూల్), ఎడ్ల సింధు (రాజవరం జెడ్పీఎస్ఎస్) జాతీయస్థాయికి ఎంపికయ్యారని షూటింగ్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు నవంబర్ 29 నుంచి బీహార్ రాష్ట్రం గయా పట్టణంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కుమార్, ఎంఈఓ గోవర్ధన్ అభినందించారు.

మాక్ పోలింగ్

బచ్చన్నపేట: మండలంలోని మొండికుంట వద్ద ఉన్న బిషప్ తుమ్మబాల హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వై.బాల మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు కలిగి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరావాలి



పాలకుర్తి: నియోజకవర్గంలోని తొర్రూరులో ఈ నెల 4వ తేదీన రైతు రుణమాఫీ అమలు కోసం చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు. పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ హామీని అమలుచేయలేదన్నారు. ధర్నాకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు. మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, అభినయ్‌గాంధీ నాయక్, యాకుబ్, మాచర్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



రఘునాథపల్లి: విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి శ్రద్ధ చూపాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్ది మోడల్‌స్కూల్‌లో మంగళవారం సైబర్ నేరాలు, మత్తు పదార్థలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై దూదిమెట్ల నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో రాణించాలి

దేవరుప్పుల: ఉన్నత విద్యాభివృద్ధి క్రమంలోనే ఆధునిక సాంకేతిక రంగాల్లో రాణించేందుకు విద్యార్థులు ఆసక్తిని కనబర్చాలని మండల విద్యాధికారి గుంటిపల్లి కళావతి సూచించారు. మండలంలోని చిన్నమడూరు హైస్కూల్‌లో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన సోహన్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నమడూరు, నేలపోగుల(లింగాలఘనపురం) హైస్కూల్‌కు చెందిన 60 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ సహదేవ్ పర్యవేక్షణలో 16 కృత్యాలపై పరికరాలతో సహా విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ శిక్షణలో నేలపోగులకు చెందిన ముగ్గురు, స్థానిక హైస్కూల్‌కు చెందిన 13 మంది తదుపరి శిక్షణకు ఎంపికయ్యారు. ఎంపికైన టీమ్‌కు కెప్టెన్‌గా ప్రజ్ఞ, వైస్‌కెప్టెన్‌గా యశ్వంత్ ఎంపికయ్యారు. సోహన్ అకాడమీ విద్యార్థులకు మాడ్యూల్స్, కిట్లు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. విద్యా శ్రేయోభిలాషి కేసరి లక్ష్మీనారాయణ, అకాడమీ రిసోర్స్ పర్సన్స్ పవన్ కుమార్, సంతోష్ హెచ్‌ఎం టి. నవీన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనగామ: మృదుల కిడ్స్‌లో బతుకమ్మ ఆట ఆడుతున్న చిన్నారులు



జనగామ: సూర్యాపేట రోడ్డు ఎస్‌పీఆర్ స్కూల్‌లో..



దేవరుప్పుల: భారీ బతుకమ్మతో 'బాలయేసు' విద్యార్థుల ప్రదర్శన



ముందస్తు బతుకమ్మ సంబురాలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు, విద్యార్థులు బతుకమ్మ ఆడిపాడారు. కాగా, దేవరుప్పులలోని బాలయేసు విద్యార్థుల ఆధ్వర్యంలో భారీ బతుకమ్మతో ప్రదర్శన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



జనగామ: సెయింట్‌పాల్స్ స్కూల్‌లో..



జనగామ: ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో..



జనగామ రూరల్: నెహ్రూ పార్క్ వద్ద సెయింట్ మేరీస్ పాఠశాలలో 36.2 అడుగుల బతుకమ్మ



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో..



లింగాలఘణపురం: మోడల్ స్కూల్‌లో..



బచ్చన్నపేటలో..



జనగామ రూరల్: హైదరాబాద్ రోడ్డు సెయింట్ మేరీస్ పాఠశాలలో..



జఫర్‌గఢ్: గీతాంజలి పాఠశాలలో..

ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మహేశ్వరశర్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

నర్మెట: సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ ఆలయాలను పరిరక్షిస్తూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వేదపండితుడు, ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ అన్నారు. మండలకేంద్రంలోని కాకతీయుల కాలంనాటి అతిపురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయనిర్మాణ కమిటీ గ్రామస్తులతో కలిసి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. కాగా, మంగళవారం స్థపతి రాజేంద్రన్, లలితా ఉపాసకులు పార్నంది శ్రీనివాస శర్మతో కలిసి ఆలయాన్ని పరిశీలించిన ఆయన కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఆలయానికి 0.33 ఎకరాల స్థలంతోపాటు మరొక 0.15 ఎకరాల స్థలం ఉందని గ్రామస్తుల, దాతల సహకారంతో ఆలయానికి పూర్వ వైభవం తేవాలనే సంకల్పంతో కార్యక్రమం చేపట్టగా రూ. 10 లక్షలు విరాళాలుగా అందాయని అన్నారు. అంచనా వ్యయం రూ.50 లక్షలుగా ఉందని దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కుల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చిల్పూరు: పల్లగుట్ట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జీడీ సుశాంత్ ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేతిడి నర్సింహరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ దేవ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా సుశాంత్‌ను చిల్పూరు ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, రమేష్, జాన్, ఆనందం, చిర్ర సుమన్‌గౌడ్ అభినందించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎం.గిరీష్‌వర్ధన్, బి.ఆశీష్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.కృతమూర్తి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ఐ అండర్ 17 ఫుట్‌బాల్ పోటీల్లో ఎం.గిరష్‌వర్ధన్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే బి.ఆశీష్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ జి.శ్రీనివాస్, పీఈటీ కె.లక్ష్మణ్, కోచ్ వై.ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు అభినందించారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. విద్యార్థులు జి నందిని, ఇ.అద్విత, జి.వంశిక, కె.శ్రీవాణి, హెచ్ వర్షిణి, పి. జ్యోతిలు ఇటీవల ఛాగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో పాటు పీఈటీ అనితను పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, టీచర్లు అభినందించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి: అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు ఇచ్చేందుకు రేపటి (గురువారం) నుంచి అధికారులు ఇంటింటి సర్వే చేస్తారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో 79 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, విద్యుత్ ప్రమాదంలో మరణించిన ఐదు కుటుంబాలకు సీఎం సహాయ నిధిలో 13 మంది లబ్ధిదారులకు ఎంపీ కడియం కావ్యతో కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ పేదల పక్షాన నిలిచే ప్రభుత్వం కాంగ్రెస్ అని.. అప్పు ఉన్నా.. సంక్షేమ పథకాలను ఆపకుండా కొనసాగిస్తుందన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించిడమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఏసీపీ భీంశర్మ, తహసీల్దార్ ఎండీ మోహిస్సొముజ్జిబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, రాంబాబు, మేకల వరలక్ష్మి, కోళ్ల రవిగౌడ్, మహేందర్‌రెడ్డి, లింగాజీ, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: దసరా పండుగ సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మంగళవారం ఎంఈఓ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు, విద్యాశాఖ నిబంధనల్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనల్ని అతిక్రమిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల యజమానులు సతీష్‌రెడ్డి, శ్రీధర్, జోసెఫ్, సంజీవరెడ్డి, మల్లేశం, సరళ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఐడీ కార్డుల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలో కల్లుగీత కార్మికులకు నూతన సభ్యత్వ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల రఘురాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్ర ఉప్పలయ్య, వెంకటమల్లయ్య మాట్లాడారు. గ్రామంలో నూతనంగా సభ్యత్వం తీసుకున్న 13 మందికి ఎక్సైజ్‌శాఖ నుంచి వచ్చిన ఐడీ కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. సంఘం నాయకులు పులి స్వామి, బత్తిని సత్యనారాయణ, పులి తిరుపతి, తాళ్లపెల్లి తిరుపతి, పులి యాకయ్య, తాళ్ళపెల్లి యాదగిరి పాల్గొన్నారు.

'బహిరంగ క్షమాపణ చెప్పాలి'

రఘునాథపల్లి: మంత్రి కొండ సురేఖపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నాయకుల అనుచిత చేష్టలకు బాధ్యతగా ఆ పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పద్మశాలి సంఘం నేత రాపోలు రామ్మూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కంచనపల్లిలో మంగళవారం సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లాలో కార్యక్రమానికి వెళ్లిన మంత్రికి గౌరవంగా ఎంపీ రఘునందన్‌రావు నూలు చిట్టెలతో మూడు రంగుల మాలగా అలంకరించి స్వాగతం పలికితే, దానిని అవహేళన చేస్తూ సోషల్ మీడియా వేదికగా కించపర్చారని ధ్వజమెత్తారు. మంత్రితో పాటు, పద్మశాలి వర్గానికి క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో పద్మశాలి కులస్తులం పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో బీఆర్ఎస్ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా నాయకులు, కోమల్ల మాజీ సర్పంచ్ వల్లాల అశోక్, కంచనపల్లి మాజీ ఎంపీటీసీ కారంపూడి వెంకటనర్సయ్య ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి

దేవరుప్పుల: పెద్దమడూరులో ప్రత్యేక సద్దుల బతుకమ్మ ఆడే గ్రామ శివారు కుంట వద్ద విద్యుత్ సౌకర్యానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు బోనగిరి నర్సింహ, మొలుగూరి రమేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఊరూరా చేపట్టనున్న ప్రజాయాత్రను విజయవంతం చేయాలని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన యాత్రకు సంబంధించిన వివరాలు తెలిపారు. భూమి కోసం, భూసమస్యల నుంచి ప్రజలను విముక్తి చేయడం కోసం సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 12వ తేదీ వరకు ఊరూరా ప్రజాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం శివారులో శంభుని ఏనె ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లను సోమవారం రాత్రి గ్రామస్తులు పట్టుకుని ఎస్సైనవీన్‌కుమార్‌కు అప్పగించారు. ఈ మేరకు ఇకనుంచి ఎర్రమట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ శ్రీనివాస్‌లకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

క్రైం కార్నర్

లారీ బోల్తా.. యువతి, మహిళలకు గాయాలు



పాలకుర్తి టౌన్: రోడ్డు దాటుతున్న మహిళ తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తాపడిన సంఘటన మంగళవారం మండలంలోని గూడూరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సహారాపూర్ నుంచి విజయవాడకు ఫైబర్ డోర్స్ లోడుతో వెళ్తున్న లారీ గూడూరు శివారులో మూలమలుపు వద్ద రోడ్డు దాటుతున్న మహిళను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో యువతితోపాటు మహిళలు ఉన్న వైపు లారీ బోల్తాపడడంతో ఉప్పనూతల రమ్య చేయి లారీ సామగ్రి కిందపడి ఇరుక్కుపోవడంతో గ్రామస్తులు ఆమెను కాపాడారు. ఉప్పనూతల రమ, బెల్లి గౌరమ్మలకు గాయాలయ్యాయని, మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. లారీడ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. లారీ ప్రమాదంలో గాయపడిన యువతిని, మహిళలను కాపాడేందుకు కృషి చేసిన ఎస్సై సాయిప్రసన్నకుమార్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులను ఏసీపీ అంబటి నర్సయ్య అభినందించారు. కాగా, లారీ బోల్తాపడిన సమయంలో అదే దారిలో వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గాయపడిన వారిని పరామర్శించారు.

నెల్లుట్లలో చోరీకి యత్నం

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సూర్యాపేట రోడ్డులోని ఎనగందుల బాలస్వామి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. బాలస్వామి ఊర్లో ఉన్న పాత ఇంట్లో ఉంటాడు. సూర్యాపేట రోడ్డు వైపు ఉన్న ఇంటికి తాళం వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి రెండు బీరువాలను ధ్వంసం చేయగా అందులో ఎలాంటి బంగారు, వెండి ఆభరణాలతో పాటు డబ్బులు కూడా లేకపోవడంతో వెళ్లిపోయారు. ఈ విషయంపై బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గంజాయి పట్టివేత

జఫర్‌గఢ్: పోలీసులు వాహనాల తనిఖీలో గంజాయిని పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని సాగరం క్రాస్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని తమ్మడపల్లి(ఐ)కి చెందిన రడపాక దివాకర్ బైక్‌పై మండల కేంద్రంపైపు వస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సాగరం క్రాస్ రోడ్డు వద్ద అతని తనిఖీ చేయగా గంజాయి లభించింది. దివాకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. అతని నుంచి 250 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బైక్, మొబైల్‌ను సీజ్ చేసి దివాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. గంజాయి విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

అధ్వానంగా రోడ్డు

- అదుపుతప్పి బోల్తా పడుతున్న వాహనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మట్టి కొట్టుకుపోయి ఏర్పడిన గుంతలు

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్-బండనాగారం గ్రామాల మధ్య మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులకు గ్రామస్తులు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. బండనాగారం నుంచి సిద్దిపేట, చేర్యాల తదితర పట్టణాలకు ప్రజలు, విద్యార్థులు వాహనాలు, సైకిళ్లపై వెళ్తుంటారు. వీఎస్ఆర్ నగర్ నుంచి కట్కూర్ వరకు మాత్రమే బీటీ రోడ్డును వేసి వదిలేయడంతో ఈ మట్టి రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. వాహనాలు గుంతల్లో అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. బండనాగారం నుంచి కట్కూర్ వరకు బీటీ రోడ్డు వేయాలని సంబంధిత అధికారు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



బండనాగారం గ్రామం నుంచి కట్కూర్ మీదుగా ప్రయాణం చేయాలంటే ఇబ్బంది అవుతోంది. ప్రజాప్రతినిధులు తూతూ మంత్రంగా మట్టిని పోయించి చేతులు దులుపుకున్నారు. దీంతో వర్షాలకు మట్టి రోడ్డుపై గుంతలు పడటంతో ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. కట్కూర్ నుంచి బండనాగారం వరకు బీటీ రోడ్డును మంజూర చేసి పనులు చేపట్టాలి.

\- రాపెల్లి జనార్దన్, బండనాగారం

బీటీ నిర్మాణానికి ఎస్టిమేషన్ వేయిస్తాం..



బండనాగారం-కట్కూర్ గ్రామానికి వెళ్లడానికి ఉన్న మట్టి రోడ్డు గుంతల మయంగా మారడంతో జిల్లా అధికారులతో మాట్లాడటం జరిగింది. బీటీ రోడ్డు వేయడానికి వ్యయ అంచనాలపై ఎస్టిమేషన్‌మేషన్ వేసి సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్‌కు పంపిస్తాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణ పనులను చేపడతాం.

\- శ్రీనివాస్, ఇన్‌చార్జ్ పీఆర్ ఏఈ

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: ఈ విద్యాసంవత్సరానికి అర్హత కలిగిన జిల్లా షెడ్యూల్ కులాల విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ బి. విక్రమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు అర్హత కలిగిన విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, అప్లికేషన్ ఐడీ నంబర్‌ను సంబంధిత కళాశాలలో ఇచ్చి మిగతా దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

నాటక సమాజాల సమాఖ్య జిల్లా కమిటీ

లింగాలఘణపురం: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు సదానందచారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మంగళవారం నెల్లుట్ల శివారు శ్రీనివాస నగర్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కన్వీనర్‌గా సంచర్ల వైకుంఠం, అధ్యక్షుడిగా అక్కెనపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా వంగ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా చెరుకు పాపయ్య, గౌరవ అధ్యక్షుడిగా నెల్లుట్ల రవీందర్‌రావు, ముఖ్యసలహాదారుడిగా కొత్త వెంకట్‌రెడ్డి, శ్రీరామోజు శ్రీనివాసు, కార్యవర్గ సభ్యులుగా మన్నె యాదవరెడ్డి, బీమగాని అంజయ్య, సాతు సోమయ్య, కె.రాజా అంజనేయులు, వంగ పరమేశ్, కామిడి రాజశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

ఎస్‌జీటీ ఉద్యోగం సాధించిన ఘన్‌పూర్ వాసి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని రైల్వేకాలనీకి చెందిన పసుల తిరుపతి సెకండ్ గ్రేడ్ టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జనగామ జిల్లా నుంచి ఎస్‌జీటీలో మూడో ర్యాంకు సాధించి కొలువు కొట్టాడు.

సంక్షిప్త సమాచారం

డీఎస్సీ ఫలితాల్లో పంచాయతీ కార్యదర్శుల ప్రతిభ

రఘునాథపల్లి: మండలంలోని ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు డీఎస్సీలో ప్రతిభ చాటారు. సోమవారం వెలుబడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ విభాగంలో కుసుంబాయితండా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ జిల్లా స్థాయి టాపర్‌గా, పడమటిగూడెం పంచాయతీ కార్యదర్శి సుజల 13వ ర్యాంక్, గోవర్ధనగిరి పంచాయతీ కార్యదర్శి టి ప్రదీప్ 22వ ర్యాంక్, వెల్ది పంచాయతీ కార్యదర్శి సాయిబాబా 48వ ర్యాంక్, శివాజీనగర్ పంచాయతీ కార్యదర్శి వేణు స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లాస్థాయిలో 2వ ర్యాంక్ సాధించారు.

సాగునీటి సరఫరా కోసం ఎవరిపాట్లు వారివే..

దేవరుప్పుల: మండలంలోని ఆయా గ్రామాల చెరువు ఆయకట్టు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వెరసి సాగు నీటి కోసం పలు పార్టీల రాజకీయ నాయకులు పాట్లు పడడం సర్వత్రా చర్చణీయంగా మారింది. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి మాధాపురం, ధర్మాపురం, దేవరుప్పులకు సాగునీటి సరఫరాకు ముందస్తుగా కాల్వలను శుభ్రం చేయించాల్సిన సదరు అధికార యంత్రాగం కనిపిస్తున్న దాఖలాలు లేవు. దీంతో రెండు రోజులుగా ధర్మాపురం ఊర చెరువుకు సాగునీటి కోసం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్లు అనంతోజు కృష్ణమూర్తి, గండిపెల్లి యాకయ్య తదితరుల ఆధ్వర్యంలో గూడూరు నుంచి ధర్మాపురం వరకు సాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా కంపచెట్లు తొలగించడమేగాక జేసీబీతో అక్కడక్కడ పూడికతీత పనులు చేపట్టడం గమనార్హం. ఇదే క్రమంలో మంగళవారం ధర్మాపురం రెవెన్యూ పరిధి మల్యా, సీత్యాతండా ఏరియాలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తోటకూరి పాండు కృష్ణ , దొపాటి నర్సయ్య తదితరుల ఆధ్వర్యంలో కాల్వ శుభ్రం చేశారు.

దుస్తుల పంపిణీ

జఫర్‌గఢ్: తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు కుందూరు సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు.

ప్లేట్లు, గ్లాసుల..

మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులక పూర్వ విద్యార్థి లక్ష్మణ్ జ్ఞాపకార్థం సతీమణి లత ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు.

పరామర్శ

నర్మెట: కన్నెబోయినగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పొన్నబోయిన బాలనర్సయ్య (55) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. కాగా, పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల సాయం అందజేశారు. అలాగే డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

కంచనపల్లి సొసైటీ చైర్మన్ అనర్హతపై హైకోర్టు స్టే

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చీమలపాటి రవీందర్‌జీ అనర్హతపై హైకోర్టు స్టే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నత న్యాయస్థాన ఉత్తర్వుల కాపీని రవీందర్‌జీ మంగళవారం డీసీఓ రాజేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ నేపథ్యంలో రవీందర్‌జీ చైర్మన్‌గా కొనసాగనున్నారు. సొసైటీకి చెందిన రూ.17.25 లక్షల దుర్వినియోగం అయినట్లు గుర్తించిన జిల్లా కోఆపరేటివ్ అధికారులు సొసైటీ అధ్యక్షుడిని అనర్హుడిగా ప్రకటించిన విషయం విధితమే. దీనిని సవాల్ చేస్తూ రవీందర్‌జీ హైకోర్టును ఆశ్రయించగా. న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

చిల్పూరు: గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మండలంలోని రాజవరం గ్రామ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వారు కలిసి వినతి పత్రం అందజేశారు.